ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

తమిళనాడు
TAMILNADU

శనివారం 6 సెప్టెంబరు 2025



పెరియార్ సిద్ధాంతాలకు నేనే వారసుడిని



యూనివర్సిటీలో ప్రసంగిస్తున్న స్టాలిన్

● ఆక్స్‌ఫర్ట్ వర్సిటీ సభలో సీఎం స్టాలిన్



ఆక్స్‌ఫర్ట్ వర్సిటీలో పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత పెరియార్ సిద్ధాంతాలకు తానే వారసుడినని, తమిళజాతిలో ఆత్మగౌరవం నింపిన పెరియార్‌ను ప్రపంచంలోని ప్రజలంతా గౌరవిస్తుండటం తనకెంతో ఆనందంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్ట్ విశ్వవిద్యాలయంలో గురువారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పెరియార్ చిత్రపటాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రతియేటా ఎంతో మంది మేధావులను రూపొందిస్తున్న ఆక్స్‌ఫర్ట్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించడం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఖ్యాతిగడించిన ఈ విశ్వవిద్యాలయంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా, దక్షిణాసియాలో విప్లవాత్మకమైన రాజకీయ మార్పులను తీసుకువచ్చిన డీఎంకే పార్టీ అధ్యక్షుడిగా మాత్రమే కాకుండా పెరియార్ మనవడిగా విద్యావంతుల ఎదుట ప్రసంగిస్తున్నానని చెప్పారు. జ్ఞానపితామహుడైన తంధై పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించడం తన జీవితంలో మరచిపోలేని సంఘటనగా భావిస్తానన్నారు. పెరియార్ సిద్ధాంతాలు విశ్వవ్యాప్తం చేసేందుకే ఈ విశ్వవిద్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించినట్లు చెప్పారు. పెరియార్‌కు ఇష్టమైన పదం 'ఆత్మగౌరవమే'నని చెబుతూ మనిషిలో ఆత్మగౌరవాన్ని నింపితే అతడు తప్పకుండా విజయం సాధిస్తారని చెబుతుండేవారని పేర్కొన్నారు. పెరియర్ తమిళనాట జన్మించినా, తమిళంలో మాట్లాడినా ఆయన సిద్ధాంతాలు మాత్రం విశ్వవాప్తంగా ఆమోదించబడుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు.



పాల్గొన్న ప్రతినిధులు

హిందూజా గ్రూప్ రూ.5వేల కోట్ల పెట్టుబడి

లండన్‌లో 'తమిళనాడు రైజింగ్' పేరిట నిర్వహించిన విదేశీ పెట్టుబడుల సమీకరణ సదస్సు సందర్భంగా హిందూజా గ్రూప్ రాష్ట్రంలో రూ.5వేల కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. ఈ మేరకు సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకుంది. దాని ప్రకారం ఆ సంస్థ ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, విడిభాగాలను ఉత్పత్తి చేయనుంది. సుమారు1000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనుంది. ఇదే విధంగా ఆస్ట్రా జెన్కా సంస్థ రూ.176 కోట్లతో తమ కర్మాగారంలో విస్తరణ కార్యకలాపాలకు ఒప్పందం కుదుర్చుకుంది. జర్మన్, ఇంగ్లండు దేశాల్లో పెట్టుబడుల సమీకరణ కోసం స్టాలిన్ జరిపిన పర్యటనలో ఆ రెండు దేశాల్లోని పలు సంస్థలు రాష్ట్రంలో రూ.13,016 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించినట్లు ప్రభుత్వం శుక్రవారం ఉదయం ఓ ప్రకటన జారీ చేసింది.

రాష్ట్ర ఉపాధ్యాయులకు రాష్ట్రపతి పురస్కారాలు





రాష్ట్రపతి నుంచి పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులకు ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేశారు. ఉపాధ్యాయుడిగా పనిచేసి, రాష్ట్రపతి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున విద్యలో ప్రతిభ చూపుతున్న ఉపాధ్యాయులకు కేంద్రప్రభుత్వం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేస్తోంది. ఈ ఏడాది, రాష్ట్రానికి చెందిన ఇద్దరు, పుదుచ్చేరికి చెందిన ఒకరు సహా 45 మంది ఉపాధ్యాయులు రాష్ట్రపతి నుంచి పురస్కారాలు అందుకున్నారు. మైలాపూర్‌లోని పీఎస్ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి పరమేశ్వరన్, తిరుప్పూర్ జిల్లా ఉడుమలైలోని భారతియార్ సెంటినరీ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి రాష్ట్రపతి నుంచి పురస్కారాలు స్వీకరించారు.



'ఉత్తమ గురువు' అవార్డు ప్రదానం చేస్తున్న ఉదయనిధి

తిరువళ్లూరులో 'డాక్టర్ సర్వేపల్లి' విగ్రహం

● డిప్యూటీ సీఎం ఉదయనిధి వెల్లడి ● 'ఉత్తమ గురువులకు' అవార్డుల ప్రదానం

● కొత్తగా 2800 మంది టీచర్ల నియామకం

అడయార్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన తిరువళ్లూరులో మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వెల్లడించారు. రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 395 మంది 'ఉత్తమ గురువుల'కు అవార్డులు ప్రదానం చేశారు. అలాగే, టీచర్స్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన 2800 మందికి ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందించారు. పాఠశాల విద్యాశాఖ కోట్టూరుపురంలోని అన్నా శతవార్షిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ స్వాగతోపన్యాసం చేశారు. ఇందులో రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ, తమిళనాడు పాఠ్యపుస్తక ప్రణాళిక బోర్డు చైర్మన్ దిండుగల్ ఐ.లియోని, దక్షిణ చెన్నై ఎంపీ తమిళిచ్చి తంగపాండియన్‌తో సహా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉత్తమ గురువులుగా అవార్డులు అందుకున్న వారికి డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఎరుక్కువాయ్ హెచ్‌ఎంకు సర్వేపల్లి అవార్డు

తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలూకా ఎరుక్కువాయ్ గ్రామపంచాయతీ మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.షణ్ముగంకు ఈ యేడాదికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చేతుల మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డును స్వీకరించారు.

13 నుంచి టీవీకే అధినేత విజయ్ పర్యటన ?

టి.నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ ఈ నెల 13 నుంచి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఆ మేరకు తిరుచ్చి నగరంలో ఆయన ప్రచారం ప్రారంభించనున్నారని పార్టీ నేతలు తెలిపారు. విజయ్ పర్యటన కోసం సకల సదుపాయాలతో ఓ లగ్జరీ బస్సు పయనూరులోని ఆయన నివాసం వద్ద సిద్ధంగా ఉందని చెప్పారు. శాసనసభ ఎన్నికలకు ఇక ఎనిమిది నెలలు మాత్రమే ఉండటంతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్ని పార్టీల కంటే ముందుగా పర్యటనను ప్రారంభించి ఇప్పటికే వందకు పైగా నియోజకవర్గాలలో ప్రచారం పూర్తి చేశారు. పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత కూడా పర్యటన చేస్తున్నారు. టీవీకే నేత విజయ్ ఇటీవలే మదురై నగరంలో పార్టీ ద్వితీయ మహానాడు నిర్వహించి రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై పార్టీ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో విజయ్ పర్యటన ప్రారంభించడం ఖాయమని, సమగ్రమైన వివరాలు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు.



విజయ్ పర్యటనకు పనయూరు బంగళావద్ద సిద్ధంగా ఉన్న బస్సు

గురువులు... భువిలో వెలసిన సురవరులు

● జనని అధ్యక్షురాలు నిర్మలా పళనివేలు



సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి తెలుగు ప్రముఖులతో కలిసి నివాళులర్పిస్తున్న జనని నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురువులు భువిలో వెలసిన సురవరులని, అందువల్లే భారతదేశ సంస్కృతిలో గురువులకు అగ్రస్థానం కల్పించారని జనని సాంఘిక, సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు, విశ్రాంత ఆచార్యులు నిర్మలా పళనివేలు పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో 1888 సెప్టెంబర్ 5న జన్మించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతిని పురస్కరించుకుని ఎంకేబీ నగర్‌లో శుక్రవారం జనని ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అతిథులు, ఆచార్యులతో కలిసి నిర్వాహకులు రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ భారతి మహిళా కళాశాల పూర్వ ఆచార్యులు నిర్మలా పళనివేలు అధ్యక్షతన ప్రారంభమైన కార్యక్రమంలో జనని వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య ఆహ్వానం పలుకుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, పదవులు, బిరుదులు తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. 32యేళ్లుగా ఇలాంటి తెలుగు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ భాషాభివృద్ధికి తమవంతు కృషిచేస్తున్నామన్నారు. అనంతరం నిర్మలా పళనివేలు మాట్లాడుతూ, ప్రపంచాన్ని పరిచయం చేసేవారు, జీవితాన్ని మలుపు తిప్పేవారు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేసేవారు గురువులని కొనియాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ, జీవిత విలువలను నేర్పించే గురువులను గౌరవించినప్పుడే సమాజం శ్రేయస్కరంగా ఉంటుందన్నారు. అయితే ఈ తరం విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై చూపుతున్న శ్రద్ధ గురువుల పట్ల చూపడంలేదని, అందుకే సమాజం అస్తవ్యస్తంగా మారిందన్నారు. క్రమశిక్షణ, జీవన విధానాలు, నైపుణ్య శిక్షణ, వినయ విధేయతలు తదితర మానవీయ విలువలను నేర్పించే గురువులను గౌరవించేలా భవిష్యత్తులోనైనా విద్యార్థులు గురుపూజోత్సవాన్ని జరుపుకోవాలని ఆయన సూచించారు. ఆ తర్వాత యతిరాజ్ మహిళా కళాశాల రిటైర్డ్ ఆచార్యులు ఉషారాణి మాట్లాడుతూ, బడిపంతులుగా బ్రతికితే అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయన్నారు. రాజధాని కళాశాల రిటైర్డ్ ఆచార్యులు మనోజ మాట్లాడుతూ, ఆచార్య వృత్తిలోనే ఆనందం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు, సీతారామనగర్ తెలుగు ప్రముఖుడు వై.పట్టాభి రామయ్య, ఐకేఏఎస్ టెక్నాలజీస్ అధినేత శోభారాజా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గురువులను, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



ఎన్డీయే గెలిస్తే నేనే సీఎం! అమిత్‌షా ఎప్పుడో చెప్పారు

● ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలిస్తేతనను సీఎం పదవిలో కూర్చోబెడతానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముందే చెప్పారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో జూలై 7వ తేదీ ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్ర శుక్రవారం తేని జిల్లా కంబం నియోజకవర్గం చేరుకుంది. కంబం వారసంత సమీపంలోని ఓ కల్యాణమండపంలో ఉదయం అన్నాడీఎంకే నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఈపీఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పడిన కూటమిలో బీజేపీ భాగస్వామ్యం పంచుకుందని ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు పలుమార్లు ప్రకటించారని, ఎన్డీయే కూటమి గెలిచినట్లైతే ఈపీఎస్ సీఎం అవుతారని కేంద్రమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని ఆనందం వ్యక్తంచేశారు. ఈ సమావేశం అనంతరం కంబం జంక్షన్‌లో స్థానిక అన్నాడీఎంకే నేతలు ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఈపీఎస్ పాల్గొని మాట్లాడారు. ముల్లై పెరియార్ డ్యాం నీటిపై ఆధారపడి ఐదు జిల్లాల ప్రజలు, రైతులు జీవిస్తున్నారని, వర్షాకాలంలో అధికస్థాయిలో నీటిని నిల్వవుంచేలా సుప్రీంకోర్టు ఉత్తర్వులను పొంది డ్యాం ఎత్తును పెంచింది మాజీముఖ్యమంత్రి జయలలిత అనే వాస్తవాన్ని తేని సహా చుట్టుపక్కల ఉన్న జిల్లాల ప్రజలు, రైతులు మర్చిపోరన్నారు. 2021లో ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

అవిభక్త అన్నాడీఎంకే నా లక్ష్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సెంగోట్టయ్యాన్

పది రోజుల్లో అందరినీ విలీనం చేయాలి

ఈపీఎస్‌కు సెంగోట్టయ్యాన్ అల్టిమేటం

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవిభక్త అన్నాడీఎంకే తన ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే చర్యలు చేపడుతున్నానని ఆ పార్టీ అసమ్మతి నేత, మాజీ మంత్రి సెంగోట్టయ్యాన్ ప్రకటించారు. మాజీ సీఎం జయలలిత మృతి తర్వాత పార్టీ నుండి విడిపోయిన నేతలను, వర్గాలను పది రోజుల్లోగా అన్నాడీఎంకేలో విలీనం చేయాలని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి గడువు విధించారు. ఈపీఎస్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న సెంగోట్టయ్యాన్ కొద్దిరోజుల క్రితం పార్టీకి సంబంధించిన కీలకమైన నిర్ణయాలను శుక్రవారం ఉదయం ప్రకటిస్తానన్న విషయం తెలిసిందే. ఆ ప్రకారమే గోపిచెట్టి పాళయంలోని తన నివాసం నుంచి ప్రచార వాహనంలో మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ఫొటోలను స్పష్టంగా కనిపించేలా కట్టుకుని ఊరేగింపుగా పార్టీ స్థానిక కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 1972లో ఎంజీఆర్ అన్నాడీఎంకేని ప్రారంభించినప్పుడే కోవైలో సర్వసభ్యమండలి సమావేశాన్ని ఘనంగా జరిపినందుకు మెచ్చుకున్నారని, ఆ తర్వాత సత్యమంగళంలో పోటీ చేయించారని తెలిపారు. ఎంజీఆర్ మృతి తర్వాత జయలలితకు పార్టీ పగ్గాలు అప్పగించాలని తాను సీనియర్ నాయకులంతా కలిసి పట్టుబట్టామని, ఆ ప్రకారమే ఆమె పార్టీ బాధ్యతలను స్వీకరించి ముఖ్యమంత్రిగా చక్కటి పరిపాలన అందించారని చెప్పారు.జయలలిత మృతి తర్వాత పార్టీకి ఎన్నో కష్టాలు ఎదురయ్యాయని, పార్టీలో చీలికలు ఏర్పడకూడదనే ఆలోచనతో శశికళకు పార్టీ నాయకత్వం అప్పగించామన్నారు.ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఈపీఎస్‌ను కూడా శశికళే నియమించారనే విషయాన్ని ఎవరూ మరువకూడదని చెప్పా రు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, పార్టీ శ్రేణుల సంతోషం కోసం ఎన్నో త్యాగాలు చేశానని, రెండు సార్లు కీలకమైన పదవులు తనను వెదుక్కుంటూ వచ్చినా తిరస్కరించినట్లు సెంగోట్టయ్యాన్ చెప్పారు. 2016 ఎన్నికల తర్వాత జరిగిన ఎన్నికల్లో పలు సవాళ్లు ఎదురయ్యాయని, 2024 ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకుంటే 30 సీట్లు సులువుగా గెలుచుకోవచ్చునని, పార్టీ నుండి విడిపోయినవారినందరినీ ఒకే వేదికపైకి తెస్తే ఆ గెలుపు తథ్యమని చేసిన సలహాలను ఈపీఎస్ పట్టించుకోలేదని ఆరోపించారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటూ విడిపోయిన అన్ని వర్గాలను విలీనం చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని, ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు ఈపీఎస్‌కు పది రోజుల గడువు ఇస్తున్నానని, ఆ లోగా విలీనం జరుగకపోతే ఈపీఎస్ ప్రచారంలో పాల్గొనే ప్రసక్తే లేదని, భావసారూప్యత కలిగిన అన్ని వర్గాలను తానే కలిపేందుకు ప్రయత్నిస్తానని ఆయన ప్రకటించారు.

మంచి నిర్ణయమే: నయినార్

పార్టీ నుంచి విడిపోయినవారంతా ఏకమవ్వాలని మాజీ మంత్రి సెంగోట్టయ్యాన్ పిలునివ్వడం మంచి నిర్ణయమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. అవిభక్త అన్నాడీఎంకే దిశగా తమ పార్టీ తరఫున కూడా ప్రయత్నించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సెంగోట్టయ్యాన్ పిలుపుపై మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ స్పందిస్తూ ఏకమవుదాం... ఎన్నికల్లో గెలుద్దాం అనే నినాదమే తారకమంత్రంగా అన్ని వర్గాలు ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందని ఆమె పేర్కొన్నారు. సెంగోట్టయ్యాన్‌కు అండగా ఉంటానని, విడిపోయినవారంతా పార్టీలో విలీనం కావాలని తానెప్పటి నుంచో కోరుకుంటున్నానని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. సెంగోట్టయ్యాన్ డిమాండ్‌పై ఈపీఎస్ ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తామని మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ చెప్పారు.

సమాచార దృష్టి

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో, 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి.యూజీ, పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు www. tngasa.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 30వతేదిలోపువిద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఉన్నతవిద్యాశాఖ ప్రకటనవిడుదల చేసింది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ స్వర్ణోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించనున్నారు. కళాశాలలు, వృత్తి విద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం చేరి, కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://licindia.in/web/guest/goldenjubileefoundation అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 22వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

మూలికా సౌందర్య సాధనాలపై శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూలికా సౌందర్య సాధనాలు (హెర్బల్ కాస్మోటిక్స్) తయారీపై ఈ నెల 17 నుంచి 19వ తేది వరకు మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగే శిక్షణకు 8వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పూర్తయిన యువతీ, యువకులు పాల్గొనవచ్చు. శిక్షణా కాలంలో తక్కువ అద్దెతో వసతి కల్పించనున్నారు. మరిన్ని వివరాలు www.editn.in అనే వెబ్‌సైట్, 8668102600, 8072914694 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

తాంబరం నుంచి ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫారం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి తదితర పనుల కారణంగా, ఎగ్మూర్ నుంచి బయల్దేరాల్సిన రైళ్లు తాంబరం, చెన్నై బీచ్ నుంచి నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్-తిరుచ్చి రాక్‌ఫోర్ట్, ఎగ్మూర్-మదురై పాండియన్, ఎగ్మూర్-తిరుచ్చి చోళన్, ఎగ్మూర్-రామేశ్వరం సేతు, ఎగ్మూర్-రామేశ్వరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎగ్మూర్‌కు బదులుగా తాంబరం నుంచి, ఎగ్మూర్-ముంబై సూపర్‌ఫాస్ట్ రైలు చెన్నై ఎగ్మూర్ నుంచి బయల్దేరనున్నాయి. ఈ మార్పు ఈ నెల 10 నుంచి నవంబరు 10వ తేది వరకు ఉంటుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

మదురైలో బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మదురై బుక్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం సాయంత్రం మంత్రులు పి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్ ప్రారంభించారు. మదురై తముక్కం మైదానంలో ఈ నెల 15వ తేది వరకు 10 రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ సందర్శించవచ్చు.ఈప్రదర్శనలో సుమారు 200లకు పైగా బుక్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పాఠశాల విద్యార్థులు, 5 నుంచి 6 గంటల వరకు కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి. 6 నుంచి రాత్రి 9గంటల వరకు విద్యారంగ నిపుణులు, ప్రముఖ రచయితలు పాల్గొనే సదస్సులు, చర్చా వేదికలు నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

రిజిస్ట్రేషన్ల ద్వారా ఒకేరోజు రూ.274 కోట్ల ఆదాయం

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గురువారం ఒకేరోజు రూ.274 కోట్లు ఆదాయం సమకూరింది. శుభ ముహూర్తపు రోజులు ప్రజలు అధికంగా ఆస్తులు క్రమ, విక్రయాలు చేస్తుంటారు. ఆ ప్రకారం, గురువారం రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు అదనపు టోకెన్లు అందించారు. దీంతో, గురువారం రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.274 కోట్లు ఆదాలయం లభించింది. గతంలో ఇదే ఏడాది (2025-26) ఏప్రిల్ 30వ తేది ఒకేరోజు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.272 కోట్లు ఆదాయం రాగా, ఈ రికార్డును అధికమించినట్లు అధికారులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన నీటి ప్రవాహం

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి ప్రవాహం పెరిగింది. డ్యాం నీటిమట్టం పూర్తి సామర్థ్యం 120 అడుగులతో కొనసాగుతుండగా, డెల్టాకు 23,200 ఘనపుటడుగుల సాగునీరు, క్రస్ట్ గేట్ల ద్వారా 7,500 ఘనపుటడుగులు అదనపు జలాలను విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

8 నుంచి టీచర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీ, డిగ్రీ టీచర్లకు ఈ నెల 8 నుంచి నైపుణాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసిన ప్రకటనలో... నుంగంబాక్కంలోని ప్రొఫెసర్ అన్బగళన్ విద్యా ప్రాంగణంలో (డీపీఐ) రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం ఈ నెల 8 నుంచి ప్రారంభం కానుంది. అకౌంటెన్సీకి 8 నుంచి 10వ తేది వరకు, ఆర్థిక శాస్త్రానికి 9 నుంచి 11, వాణిజ్యం పాఠ్యాంశానికి 11 నుంచి 13వ తేది వరకు శిక్షణ అందించనున్నారు. శిక్షణలో పాల్గొనాల్సిన ఉపాధ్యాయుల జాబితా అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపినట్లు ఎస్‌సీఈఆర్‌టీ తెలియజేసింది.

నకిలీ ఈ-చలానాతో మోసం

● పోలీసు శాఖ హెచ్చరిక

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి నకిలీ ఈ-చలాన్ల ద్వారా మోసం జరుగుతోందని, ఈ విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ సూచించింది. ఈ మేరకు పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ట్రాఫిక్ ఉల్లంఘన ఈ-చలాన్ మోసం వాట్సాప్ ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వాట్సాప్‌లో mParivahan యాప్ పేరు సూచించి APK ఫైల్ లింక్ వస్తోంది, లింక్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత, బ్యాంకింగ్ సమాచారం దొంగలించి, లావాదేవీల్లో మోసానికి పాల్పడుతున్నారని తెలిపింది. ట్రాఫిక్, ప్రభుత్వానికి సంబంధించిన ప్రకటనలు వాట్సాప్ ద్వారా పంపించరని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే జరిమానాకు సంబంధించి సమాచారం ఉంటుందన్నారు. అలాగే, గుర్తుతెలియని నెంబర్ల నుంచి APK ఫైల్, ఇతర అప్లికేషన్లు పంపి OTP తదితర వివరాలు అడుగుతున్నారని తెలిపింది. అలాంటి లింక్‌ను నమ్మి నగదు కోల్పోయిన వారు వెంటనే సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయాలని పోలీసు శాఖ సూచించింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్యారీస్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కొన్ని చోట్ల శుక్రవారం మిలాద్ ఉన్ నబి, ఓనం కారణంగా సెలవు కావడంతో వివిధ విద్యాలయాల్లో గురువారమే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పాల్గొని గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేసి అభినందించారు. అమింజికరైలోని చెన్నై మాధ్యమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి చిత్రపటానికి విద్యార్థులు పూలు చల్లి ఘన నివాళులర్పించారు.




చెన్నై మిడిల్ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించి, టీచర్లకు గులాబీలు అందిస్తున్న విద్యార్థులు

ప్రాథమిక చికిత్సపై యువతకు శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక చికిత్సపై యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు 108 అంబులెన్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ సెల్వకుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో ఏడాదికి వందకు పైగా ప్రమాదాలు సంభవించే 50 ప్రాంతాలను ఎంపిక చేసి, ఆ ప్రాంతాల్లోని వ్యాపారులు, వాచ్‌మెన్‌లు, పోలీసులు, యువకులు మొత్తం 50 మందికి ప్రాథమిక చికిత్సపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. తొలివిడతగా మదురై, తిరుచ్చి, వేలూరులో శిక్షణ ప్రారంభించామని, శిక్షణ పూర్తి చేసిన వారికి గుర్తింపు సర్టిఫికెట్, శిక్షణ మాన్యువల్ అందించనున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విపత్తులు, పాము కాటు తదితరాలు సంభవిస్తే, 108 సేవలను సంప్రదిస్తే, సత్వరం ఈ ప్రాంతంలో శిక్షణ పొందిన 50 మందికి మెసేజ్‌లు వెళ్తాయని, వారు అక్కడకు చేరుకుని ప్రాథమిక చికిత్స అందిస్తారని, ఈ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు సెల్వకుమార్ తెలిపారు.

పోలీసు వందనంపై ప్రభుత్వం మార్గదర్శకాలు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ప్రధాన మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, గవర్నర్, ముఖ్యమంత్రి తదితర ఏడుగురు ముఖ్య నాయకులకు మాత్రమే పోలీసు కవాతు అనుమతించేలా కొత్త విధానం నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేసింది. రాష్ట్రపతి కార్యాలయం, ఉప రాష్ట్రపతి కార్యాలయం, ప్రధాన మంత్రి కార్యాలయాల సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యాక్రమాలకు హాజరయ్యే వీవీఐపీలకు గౌరవ వందనం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ఆనవాయితీ. ఈ క్రమంలో, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి తదితరులకు మాత్రమే పూర్తి పోలీసు గౌరవ వందనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, సీనియర్ పోలీసు అధికారులను ఆదేశించింది.

అన్నాడీఎంకే-బీజేపీ కూటమి మునిగే నౌక

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందుగై

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే-బీజేపీ కూటమి మునిగే నౌక అని, ఈ విషయం గ్రహించిన పలువురు ఆ కూటమి నుంచి వైదొలుగుతున్నారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షులు సెల్వపెరుందగై వ్యాఖ్యానించారు. టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి నుంచి పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్ వైదొలిగారని, ప్రస్తుతం సెంగోట్టయన్ కూడా అదే బాటలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమిని అంగీకరించే పరిస్థితులు లేవని తెలుసుకున్న నేతలు, ఆ కూటమి నుంచి వైదొలుతున్నారని, భవిష్యత్తులో మరెవరెవరూ వెళ్తారో చూడాలన్నారు. ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసే రాజకీయ పన్నాగం బీజేపీ ఆడుతోందని, పలు రాష్ట్రాల్లో ఈ విషయం రుజువైందని తెలిపారు. అన్నాడీఎంకే కూడా ఆ విషయం గ్రహించి పార్టీ కాపాడుకొనేందుకు ముందు జాగ్రత్త పాటించాలని సెల్వపెరుందగై సూచించారు.

సమాజాభివృద్ధికి గురువులే వెన్నెముక



గురుపూజోత్సవంలో విద్యార్థినులు

తిరుత్తణి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే వెన్నెముకవంటివారని తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల పూర్వ విద్యార్థి కైలాష్ పేర్కొన్నారు. ఆ పాఠశాలలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో పాఠశాల పూర్వ విద్యార్థులు కైలాష్, డాక్టర్ పళని, సుభాష్, వెంకటేశన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా, విద్యార్థినులు ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథం, గుణశేఖరన్, పళని, ఉషా, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఖాళీ మద్యం సీసాలను వెనక్కి..

నవంబర్ 30లోగా అమలుచేయండి : హైకోర్టు

టి.నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ దుకాణాల్లో ఖాళీ మద్యం సీసాలను వెనక్కి తీసుకునే పథకాన్ని నవంబర్ 30లోగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని హైకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేసింది. ఈ పథకాన్ని రాష్ట్రమంతటా అమలు చేయాలని ఇదివరకే న్యాయమూర్తులు ఎస్ సతీష్‌కుమార్, డి. భరత్‌చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు మళ్ళీ గురువారం ఆ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఆ సమయంలో టాస్మాక్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.విశాఖన్ ఓ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తూ రాష్ట్రంలోని 38 జిల్లాలకుగాను 22 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చామని తెలిపారు. టాస్మాక్ దుకాణాలలో కొనుగోలుచేసే మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల పనులు పూర్తయిన తర్వాత ఈ పథకాన్ని రాష్ట్రమంతటా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆ కౌంటర్ అఫిడవిట్ పట్ల సంతృప్తిని ప్రకటించిన న్యాయమూర్తులు ఖాళీ మద్యం సీసాలను వెనక్కి తీసుకునే పథకాన్ని రాష్ట్రమంతటా నవంబర్ 30గా అమలు చేయాలని ఆదేశించి, కేసు తదుపరి విచారణ అక్టోబర్ 10కి వాయిదా వేశారు.

టెండర్‌కు వ్యతిరేకంగా పిటిషన్

● పిటిషనర్‌కు రూ.50 వేల అపరాధం

అడయార్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మైలాడుదురై బస్టాండు ప్రాంగణలో కొత్తగా నిర్మించనున్న వాణిజ్య భవన సముదాయానికి ఆహ్వానించిన టెండర్ల విధి విధానాలను వ్యతిరేకిస్తూ ఒక వ్యక్తి పిటిషన్ వేయగా, మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిటిషనర్‌కు రూ.50 వేల అపరాధం విధించింది. ఈ టెండర్లపై మణక్కుడి అనే గ్రామానికి చెందిన వీరయ్యన్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. మైలాడుదురై కొత్త బస్టాండు మున్సిపాలిటీ పరిధిలో ఉందని, ఈ బస్టాండుకు వెళ్ళేందుకు సరైన రహదారి కూడా లేదన్నారు. పైగా బస్టాండు నిర్మించిన స్థలం మణక్కుడి గ్రామానికి చెందిన పోరంబోకు భూములన్నారు. ముఖ్యంగా టెండర్ల విధి విధానాలు న్యాయ సహేతుకంగా లేవని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు... ప్రభుత్వ, పిటిషనర్ తరపున వాదనలు ఆలకించి, కేవలం పబ్లిసిటీ కోసమే ఈ పిటిషన్ వేశారంటూ పిటిషనర్‌కు రూ.50 వేల అపరాధం విధించి, పిటిషన్‌ను కొట్టివేసింది.

గురువులకు వినూత్నంగా కృతజ్ఞతలు





లోగో ప్రదర్శనలో విద్యార్థులు - తమకు ఇష్టమైన టీచర్, వారిపై కవితతో కూడిన ప్లకార్డులతో విద్యార్థులు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కారైక్కుడిలోని ప్రైవేటు పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు, తమకు ఇష్టమైన ఉపాధ్యాయుల చిత్రాలు, వారిపై రాసిన కవితతో కూడిన ప్లకార్డులు పట్టుకుని 'హ్యాపీ టీచర్స్ డే (ఇంగ్లీషు అక్షరాలు)' ఆకారంలో నిలబడి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపేలా చేపట్టిన ఈ ప్రదర్శన, ఇంటర్నేషనల్ ప్రింట్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదుచేస్తూ సంస్థ నిర్వాహకులు పాఠశాల నిర్వాహకులకు సర్టిఫికెట్ అందజేశారు.

మళ్లీ డీఎంకేదే అధికారం

● గ్రామ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని గొల్లకుప్పం గ్రామంలో శుక్రవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం జరిగింది. మండల కార్యదర్శి సీజే శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం ప్రజల సంక్షేమార్థం వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజలంతా మళ్ళీ డీఎంకేనే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీఎంకే నియోజకవర్గ పరిశీలకులు షణ్ముగనాథన్, సీజే.సెంథిల్‌కుమార్, యూనియన్ మాజీ చైర్మెన్ లోగనాథన్, వ్యవసాయ డిప్యూటీ ఆర్గనైజర్ దండపాణి సహా గ్రామ కమిటీ నిర్వాహకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ దేశానికే ఆదర్శం

● మాజీ ఎంపి జి.హరి



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నేతలు

తిరుత్తణి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికే ఆదర్శమని అన్నాడీఎంకే నేత, మాజీ ఎంపీ జి.హరి పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తిరువళ్లూరు జిల్లా తిరుపత్తిలో మాజీ ఎంపీ జి.హరి ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెబర్ 5వ తేదీన తిరుత్తణిలో జన్మించిన తెలుగు ప్రముఖుడని, ఆయన జన్మించిన దినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అయినప్పటికీ తమిళనాడు ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థంగా ఈ రోజును ప్రత్యేక దినంగా ప్రకటించడంలేదన్నారు. ఇప్పటికైనా సెప్టెంబర్ 5వ తేదీ రాధాకృష్ణన్ స్మారక దినంగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించాలని జి.హరి డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తిల్లైగంగా నగర్: మహాలక్ష్మి వీధి, మురుగన్ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, అమరావతి అవెన్యూ, జాకబ్ వీధి, జగన్నాథన్ వీధి, శ్రీనివాసన్ వీధి, ఓయో వీధి, నేతాజీ వీధి, మణిమేఘలై వీధి, కన్నగి వీధి, స్కూల్ వీధి, నాగప్ప ఫ్లాట్స్, అరుళ్‌జ్యోతి వీధి, అన్నామలై వీధి, కుమరన్ వీధి, పద్మావతి వీధి, పుళుదివాక్కం, మడిపాక్కం. **పోరూర్:** లక్ష్మీ అవెన్యూ, ముగలివాక్కం మెయిన్ రోడ్డు, రామచంద్ర నగర్, బాలాజీ నగర్, అన్నై వేలాంకన్ని నగర్, కుమారి నగర్, శివాజీ నగర్, ఓంశక్తి నగర్, ఎమ్మార్కే నగర్, ఎల్ అండ్ టీ నగర్, మాథా నగర్. **అన్నాసాలై:** టీవీ స్టేషన్, ట్రిప్లికేన్, పీడబ్ల్యూడీ కాంప్లెక్స్, ప్రెసిడెన్సీ కాలేజ్, పెద్ద వీధి, సైదోజి వీధి, టీహెచ్ రోడ్డు, అయ్యాపిళ్లై వీధి, అక్బర్ సాహిబ్ వీధి, రంగనాథన్ వీధి, లాల్ మద్ వీధి, బెల్స్ రోడ్డు, సీఎన్‌కే రోడ్డు అండ్ లైన్, మహ్మద్.అబ్దుల్లా వీధి అండ్ లైన్, వెంకటేశన్ వీధి, అర్ముగం వీధి, ఎళిలగం కాంప్లెక్స్, మద్రాసు యూనివర్శిటీ కాంపస్, వాలాజా రోడ్డు, మియాన్‌సాహిబ్ వీధి, మురుగప్ప వీధి, సుబ్రమణి చెట్టి వీధి అండ్ లైన్, అరుణాచల ఆచారి వీధి, టైపూన్ అలిఖాన్ వీధి, యూసఫ్‌లాల్ భాయ్ వీధి అండ్ లైన్, అబ్దుల్ కరీమ్ వీధి, అటీబుల్లా వీధి, పక్కిరిసాహెబ్ వీధి, చెల్లపిళ్లయార్ ఆలయ వీధి, కుప్పుముత్తు వీధి, వల్లభ అగ్రహారం, మేయర్ చిట్టిబాబు వీధి, నాగప్పయర్ వీధి, సారధి వీధి, పులిప్పన్ బజార్. **తిరువాన్మియూర్:** ఇందిరా నగర్ 1,2 అవెన్యూలు, 4,9,12 క్రాస్ వీధులు, కెనాల్ బ్యాంక్ రోడ్డు, వెంకటరత్నం నగర్, ఐశ్వర్య కాలని, సీఎస్ కాలని. **గిండి:** సరస్వతి నగర్, కల్కి నగర్, భువనేశ్వరి నగర్, వినాయకపురం, చొక్కలింగం నగర్, ఏజీఎస్ కాలని 1 నుంచి 10 మెయిన్ రోడ్లు, అండాళ్ నగర్ 2,3 మెయిన్ రోడ్లు, సంగత్ అపార్ట్‌మెంట్స్, మల్లీస్ అపార్ట్‌మెంట్స్, ఎస్తెల్ హోమ్స్, డీఆర్‌ఏ సల్మా అపార్ట్‌మెంట్స్, డీఆర్‌ఏ రెజింగ్టన్. **పంజెట్టి:** అళింజివాక్కం, అత్తిపేడు, ఇరులిపట్టు, జనపసత్రం కూట్ రోడ్డు, పెరియపాళయం రోడ్డు, జగన్నాధపురం రోడ్డు, సాయికృప నగర్, విరుందావన్ నగర్, ఎంకే గార్డన్, శ్రీ నగర్, ఎస్వీ ఫామ్, మాలివాక్కం, అమూర్ జగన్నాధపురం సత్రం, కుత్తిరైపల్లం. **పొన్నేరి:** వేలోడై, వైరవన్ కుప్పం, ఎలియంబేడు పెరియ రావనం, మహీంద్ర సిటీ, కృష్ణాపురం కనకంబాక్కం. **అన్నా నగర్:** శాంతి కాలని, ఏఏ టు ఏఎం బ్లాక్‌లు, పాత ఎల్,వై,జడ్ బ్లాక్, 7వ మెయిన్ రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ క్వార్టర్స్, ఏ,బీ,డబ్ల్యూ బ్లాక్, 2 నుంచి 6 అవెన్యూలు, షెనాయ్ నగర్, భారతిపురం, పెరియ కూడల్ 1 నుంచి 3 మెయిన్ రోడ్లు, వెస్ట్ క్లబ్ రోడ్డు, అమింజికరై, పీపీ గార్డన్, ఎంఎం కాలని, ఎస్ఎస్కే నగర్, ఎన్ఎం రోడ్డు.

మూడో కాన్పుకు ప్రసూతి సెలవు నిరాకరించడం అన్యాయం

● మద్రాసు హైకోర్టు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మూడో కాన్పుకు ప్రసూతి సెలవు నిరాకరించడం న్యాయం కాదని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఉళుందూర్‌పేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రంజిత, ప్రసూతి సెలవు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు నిరాకరిస్తూ మున్సిపల్ కోర్టు అందజేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ రంజిత హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. కేసు విచారించిన హైకోర్టు, మూడో సారి గర్భవతి అయిన పిటిషనర్ రంజితకు ప్రసూతి సెలవు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

నీటమునిగి ప్రియురాలి మృతి

● మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నీటమునిగి ప్రియురాలు మృతి చెందిందనే వార్త విన్న యువకుడు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోయంబత్తూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కవిక్కనాయకన్‌పాళయానికి చెందిన ధనుష్ (21)కు ప్లస్ టూ చదువుతున్న విద్యార్థినితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో, ఆ విద్యార్థిని ఓనం పండుగ సందర్భంగా కేరళ రాష్ట్రంలోని తన స్వగ్రామానికి వెళ్లింది. ఆ గ్రామంలోని చెరువులో స్నానం చేస్తున్న విద్యార్థి, నీటమునిగి మృతిచెందింది. స్వగ్రామానికి వెళ్లే సమయంలో ఆ విద్యార్థిని ధనుష్‌కు సెల్‌ఫోన్‌లో మెసేజ్ ఇచ్చినట్లు సమాచారం. రెండు రోజులుగా ప్రియురాలి నుంచి మెసేజ్‌లు రాకపోవడంతో ధనుష్, ఆమె ఫోన్ చేయగా, ఆమె నీట మునిగి మృతిచెందినట్లు తెలిసింది. ఆమె లేకుండా తాను బతకలేనని స్నేహితులకు తెలిపి ధనుష్ విషం తాగి ఇంటికి వెళ్లాడు. ఇంటికెళ్లిన ధనుష్ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు అతనిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై తొండాముత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో 25 ఏళ్ల జైలు శిక్ష రద్దు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో దిగువ కోర్టు దిండుగల్ యువకుడికి విధించిన 25 ఏళ్ల జైలుశిక్షను హైకోర్టు మదురై బెంచ్ రద్దు చేసింది. ఇద్దరం సంతోషంగా జీవిస్తున్నప్పుడు, అతన్ని జైలుకు పంపితే, తాను, బిడ్డ నిస్సహాయులుగా రోడ్డు మీద పడాల్సి ఉంటుందని మహిళ కోర్టుకు తెలిపింది. ప్లస్ టూ చదువుతున్న తన కుమార్తెతో లైంగిక సంబంధం కలిగి, గర్భవతిని చేశాడంటూ బాలిక తల్లి దాఖలుచేసిన కేసు విచారించిన కోర్టు, నిందితుడికి 25 ఏళ్ల జైలుశిక్ష విధించింది. కోర్టు ఉత్తర్వులపై నిందితుడు హైకోర్టు మదురై బెంచ్‌లో అప్పీలు చేయగా, బాధితురాలి వాదన అంగీకరించిన న్యాయస్థానం, జైలు శిక్ష రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

పెళ్లి కాలేదని జూనియర్ ఆర్టిస్ట్ ఆత్మహత్య

అడయార్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన ఆవడిలో పెళ్ళి కాలేదన్న మనస్తాపంతో జూనియర్ ఆర్టిస్ట్ ఒకరు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఆవడి, కోవిల్‌పదాగై ప్రాంతానికి చెందిన అశోక్ కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమార్తెకు వివాహం కాగా, రెండో కుమార్తె రూపకల (31) జూనియర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నారు. అయితే, ఈమెకు కొంతకాలంగా పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పటికీ ఏ ఒక్కటీ కుదరలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రూపకల ఇంటిలోనే ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఎవరూ ఆదరించడం లేదని...

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నానగర్ సమీపంలోని తిరుమంగళం పార్క్ అవెన్యూ మెయిన్‌రోడ్డులోని బహుళ అంతస్తుల భవనం నాలుగో అంతస్తుపై నుంచి కిందకు దూకి ప్రజిత్ (16) అనే ప్లస్- 2 విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మాజీ సైనికుడైన ప్రజిత్ తండ్రి పాల్‌రాజ్ పొన్నేరిలోని ఓ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ప్రజిత్ అన్నానగర్ వెస్ట్ ప్రాంతంలోని ప్రవేటు పాఠశాలలో ప్లస్-2 చదువుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన అతడు నాలుగో అంతస్థుపైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఇన్‌స్టాగ్రామ్‌లో అతడు ఓ సందేశం వెలువరించాడు. తనను ఎవరూ ఆదరించడం లేదని, చావడమే మేలని ఆత్మహత్మ చేసుకుంటున్నానని ఆ సందేశంలో పేర్కొన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేకే నగర్‌లో గంజాయి విక్రయం

● ఐటీ ఉద్యోగులు సహా ఐదుగురి అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకేనగర్ పిటి రాజన్ సాలైలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు ఐటీ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రత్నకుమార్ నాయకత్వంలో పోలీసులు ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా అశోక్‌నగర్‌కు చెందిన కార్తీక్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడిచ్చిన సమాచారం మేరకు గంజాయి విక్రయిస్తున్న పల్లావరం ప్రాంతానికి చెందిన గోకల్, అశోక్‌నగర్‌కు చెందిన ఉదయకుమార్, కిషోర్, కేకేనగర్‌కు చెందిన ఆదిత్య అనే వారిని అరెస్టు చేశారు వీరి నుండి 8 కేజీల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయినవారిలో కిషోర్, ఆదిత్యా బెంగళూరులోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది.

కోహ్లీని తిట్టాడని స్నేహితుడి హత్య

● వీరాభిమానికి యావజ్జీవకారాగార శిక్ష



ధర్మరాజ్‌ను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళుతున్న పోలీసులు

టి.నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రికెటర్ విరాట్ కోహ్లీని దూషించిన స్నేహితుడిని మద్యం మత్తులో దారుణంగా హత్యచేసిన నిందితుడికి అరియలూరు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అరియలూరు ప్రాంతానికి చెందిన ధర్మరాజ్ (24) క్రికెటర్ విరాట్ కోహ్లి వీరాభిమాని. 2022 ఐపీఎల్ సీజన్ సమయంలో ధర్మరాజ్ తన స్నేహితుడు విఘ్నేష్ (25)తో కలిసి ఊరి చివర మద్యం తాగాడు. కాగా రోహిత్‌శర్మ అభిమాని అయిన విఘ్నేష్ క్రికెటర్ విరాట్ కోహ్లీని కించపరిచేలా వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆగ్రహించిన ధర్మరాజ్ వేట కొడవలితో దాడి చేసి హతమార్చాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్మరాజ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ అరియలూరు కోర్టులో జరిగింది. గురువారం ఉదయం ధర్మరాజ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ మలర్ వాలంటీనా తీర్పు వెలువరించారు.

అమెరికా సుంకాలకు నిరసనగా

వామపక్షాల భారీ ధర్నా



ధర్నాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముత్తరసన్, షణ్ముగం, ఆశైతంబి తదితరులు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం భారతదేశ దిగుమతులపై 50 శాతం సుంకాలను విధించడానికి నిరసనగా నగరంలో వామపక్షాల సంయుక్త ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. అన్నాసాలై తారాపూర్ టవర్ కూడలి వద్ద శుక్రవారం ఉదయం సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మూడు పార్టీలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఆందోళనకు సీపీఐ రాష్ట్రకమిటీ కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి. షణ్ముగం, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ఆశైతంబి నాయకత్వం వహించారు. ధర్నానుద్దేశించి సీపీఎం నేత షణ్ముగం మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ఇద్దరూ స్నేహితులమని గొప్పలు చెప్పుకున్నారని 50 శాతం పన్నుల విధింపుతో బద్ధశత్రువులను రుజువైందన్నారు. సీపీఐ నేత ముత్తరసన్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల వల్ల రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని, ఈ సుంకాల వల్ల నష్టపోతున్న రాష్ట్రంలోని పరిశ్రమలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తిరుచెందూర్ స్వర్ణ రథం ఊరేగింపు ప్రారంభం



రథం లాగుతున్న మంత్రులు శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్ తదితరులు

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం నుంచి స్వర్ణ రథం ఊరేగింపు పునః ప్రారంభం కానుంది. తిరుచెందూర్ సుబ్రమ ణ్యస్వామి ఆలయంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు గిరి ప్రాకారంలో స్వర్ణరథం ఊరేగిస్తారు. ఆలయ ప్రాంగణంలో మరమ్మతుల కారణంగా 2024 జూలై 17 నుంచి స్వర్ణ రథం ఊరేగింపు తాత్కాలికంగా నిలిపివేశారు. గిరి ప్రాకారం చుట్టుప క్కల చేపట్టిన మరమ్మతులు ముగియడంతో, గురువారం సాయంత్రం స్వర్ణ రథం ఊరేగింపు ప్రారంభించారు. ఉత్సవ మూర్తులు జయేంద్రనాథర్, వల్లి దేవసేన ఆశీనులైన స్వర్ణ రథాన్ని మంత్రులు పీకే శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్ ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో 'మిలాదున్ నబి' వేడుకలు



ట్రిప్లికేన్‌లో శాంతి ర్యాలీలో పాల్గొన్న ఇస్లామీయులు

ప్యారీస్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పరమ పవిత్రంగా భావించే 'మిలాదున్ నబి'ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు మతసామర స్యాన్ని చాటేలా శాంతి ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు మహ్మద్ ప్రవక్తను గుర్తుచేస్తూ భక్తిగీతాలు ఆలపించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వేదికలపై మత పెద్దలు దైవదూత మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని బోధించారు. మహమ్మద్ నబిగళ్ జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామీయులు 'మిలార్ ఉన్ నబి'గా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయం ముస్లింలంతా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే, పేదలకు ఆహారం, దుస్తులు అందజేశారు. ట్రిప్లికేన్‌లోని పెద్ద మసీదు ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం తమిళనాడు దర్గాల సమాఖ్య పేరవై ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శాంతి ర్యాలీలో ముస్లింలు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డు సభ్యులు ఎస్‌కే నవాజ్, సయ్యద్ యాకుబ్, సయ్యద్ అహ్మద్ మస్తానీ, ముస్లిం మతగురువులు, ముత్తవల్లీలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ అనంతరం ఎస్‌కే నవాజ్ మాట్లాడుతూ... పవిత్ర ఖురాన్, మహ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని పాటిస్తూ పేదలకు తమవంతు సహాయం చేయాలని సూచించారు.

కలశలింగం వర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్‌లో 28వ ర్యాంకు



డాక్టర్ కె.శ్రీధరన్

అడయార్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవనరుల విద్యాశాఖ తాజాగా ప్రకటించిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో 'కలశలింగం యూనివర్సిటీ'కి జాతీయ స్థాయిలో 28వ ర్యాంకు వరించింది. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యా రంగంలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలకు ర్యాంకులను వెల్లడించారు. ఈ నేపథ్యంలో దేశంలోని వర్సిటీల్ల ఒకటైన కలశలింగం అకాడెమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ డీమ్డ్ వర్సిటీకి 28వ ర్యాంకు దక్కింది. ఇంజనీరింగ్ విభాగంలో 33 ర్యాంకు దక్కించుకుందని ఛాన్సలర్ డాక్టర్ కె.శ్రీధరన్, ప్రొ ఛాన్సెలర్ డాక్టర్ ఎస్.అరివళై, వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.శశి ఆనంద్ తదితరులు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్య విద్య డైరెక్టర్‌గా డాక్టర్ సుగంధి రాజకుమారి



పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ డైరెక్టర్‌గా డాక్టర్ సుగంధి రాజకుమారి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్య డైరెక్టర్‌గా పనిచేసిన డా.సంగుమణి జూన్ 30వ తేది పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో సుగంధి రాజకుమారికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కన్నియాకుమారి జిల్లా ఉత్తర సూరంగుడి గ్రామానికి చెందిన సుగంధి రాజకుమారి, 36 ఏళ్లుగా వైద్య విద్య రంగంలో ఉన్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో డెర్మటాలజీ విభాగంలో ప్రొఫెసర్, అధిపతిగా పనిచేశారు. 2019లో కన్నియాకుమారి ప్రభుత్వ వైద్యకళాశాల డీన్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం, దిండుగల్ ప్రభుత్వ వైద్యకళాశాల డీన్‌గా పనిచేస్తున్న డా.సుగంధి రాజకుమారి, వైద్య విద్య డైరెక్టరేట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. గురువారం బాధ్యతలు చేపట్టిన ఆమెకు అధికారులు, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

తరుణి



కీర్తనలు ఆలపిస్తున్న గాయత్రి

తల్లిదండ్రులతో...

గాత్ర, వాద్య సంగీత 'విభావరి'

● వర్ధమాన కళాకారిణి 'గాయత్రి విభావరి వ్యాకరణమ్'

'లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని, లక్ష్య సాధనలో సైతం చూపించాలి.. ఇదే విజయ రహస్యం' అన్నారు స్వామి వివేకానంద. ప్రతిభ ఉన్నంత మాత్రాన విజయం సాధిస్తామన్నది అపోహే. సంకల్పశక్తి, అనంతమైన పట్టుదల, కఠోర పరిశ్రమ మిళితమైతేనే విజయం చేరువ అవుతుంది. ప్రేరణ, ప్రోత్సాహం కూడా తోడైతే మరిన్ని విజయాలు సాధించగలుగుతాం. అన్నింటిని అందిపుచ్చుకొని విజయపథాన కీర్తిపతాకం ఎగరవేయాలన్న తపనతో ఉద్యమిస్తున్నది వర్ధమాన గాత్ర, సంగీత, వయోలిన్ కళాకారిణి గాయత్రి విభావరి.

వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

సంగీతమే ప్రపంచంగా జీవించే తల్లిదండ్రులతో, సంగీతమే శ్వాసగా, ధ్యాసగా భావించే సోదరులతో, ఇల్లే ఒక సంగీత పాఠశాలగా వెలుగులు విరజిమ్ముతుంటే 'సంగీతం నా ఆరో ప్రాణం' అని ఆ కుటుంబ సభ్యురాలు గాయత్రి పలకడంలో ఆశ్చర్యం లేదుకదా! సర్వాన్ని సాధించగలిగే సంకల్పశక్తితో, గాత్ర, వాద్య సంగీతాలను అభ్యసిస్తూ, శిక్షణ నిస్తూ, మరోవైపు చదువులో ఉన్నతిని సాధిస్తూ, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని తపిస్తూ ముందుకు సాగుతున్నది తరుణి గాయత్రి విభావరి వ్యాకరణమ్. ఆమె సంగీత ప్రయాణం నేటి 'తరుణి'లో.....

గాయత్రి పుట్టింది విజయనగరంలో అయినా పెరిగింది వైజాగ్‌లో. తండ్రి వెంకటాద్రి భరద్వాజ్. తల్లి విజయకామేశ్వరి. తండ్రి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగి. ఆయన సంగీతం, ఫ్లూట్ వాద్యంలో నిపుణుడు. తల్లి సంగీతంలో ఎం.ఎ., చేశారు. అదేవిధంగా సంగీత తరగతులను నిర్వహిస్తున్నారు. గాయత్రికి ఇద్దరు సోదరులు. ఒకరు ఫ్లూట్, మరొకరు మృదంగం వాయించడంలో ప్రావీణులు.

గాయత్రి విద్యాభ్యాసం వైజాగ్‌లోనే జరిగింది. డీఏవీ స్కూల్‌లో టెన్త్, ఎస్సెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేసింది. సైకాలజీ ప్రధాన అంశంగా సెయింట్ జోసెఫ్ కాలేజీలో బి.ఏ., చదివి ప్రస్తుతం దూర విద్య ద్వారా ఎం.బి.ఏ., చదువుతోంది.

ప్రదర్శనలు...

చెన్నైలో మ్యూజిక్ అకాడమీ, పార్థసారథి స్వామి సభ, ఆర్.కె కన్వెన్షన్ సెంటర్, సునాద లహరి, ఆర్ఆర్ సభ, భారతీయ విద్యాభవన్ మొదలైన చోట్ల గాయత్రి గాత్ర, వయోలిన్ కచేరీలతో శ్రోతల ప్రశంసలందుకుంది. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం, రవీంద్ర భారతి హైదరాబాద్, మ్యూజిక్ కాలేజీ, విజయవాడ, తిరుమల నాద నీరాజనం మొదలైన వేదికలపై గాయత్రి తన ప్రతిభతో అందరి మెప్పు పొందింది. 10 సంవత్సరాల వయసులో గాత్ర కచేరి, 13 సంవత్సరాల ప్రాయంలో వయోలిన్ కచేరిలతో ప్రారంభమైన గాయత్రి సంగీత ప్రస్థానం నేడు మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. గాయత్రి తన

సంగీత ప్రస్థానం.... : సంగీత నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించిన గాయత్రికి పుట్టుకతోనే ఆ కళ అబ్బింది. బాల్యం నుంచే సంగీతం పట్ల ఆకర్షితురాలైంది. ఆమెకు ప్రథమ గురువులు తల్లిదండ్రులే. స్కూలుకి వెళ్లేముందు ఇంట్లో తప్పనిసరిగా ఒకటిన్నర గంట సాధన చేయించేవారని, క్రీడా తరగతులు ఉన్నప్పుడు స్కూలు యాజమాన్యం అనుమతితో తల్లి ఇంటికి తీసుకొచ్చి గంట సంగీతాభ్యాసం చేయించేవారని గాయత్రి తెలిపింది. శాస్త్రీయ సంగీతంలో సంగీత సుధానిధి మందా సుధారాణి వద్ద శిక్షణ తీసుకుంది. వయోలిన్ వాద్యంలో విద్వాన్ హెచ్.రామచరణ్ వద్ద శిక్షణ తీసుకున్న గాయత్రి.. ప్రస్తుతం సంగీత కళానిధి ఎ.కన్యాకుమారి వద్ద వయోలిన్ వాద్య సంగీతానికి మెరుగులు దిద్దుకుంటోంది.

సాధించిన విజయాలు...

- ●ఆల్ ఇండియా రేడియోలో ఈ సంవత్సరం డైరెక్టర్‌గా బి హైగ్రేడ్ పొందడం.
- ●2024వ సంవత్సరంలో ముంబైలోని 'షణ్ముఖానంద సభ' ఆధ్వర్యంలో ఎం.ఎస్ సుబ్బులక్ష్మి ఫెలోషిప్ అవార్డు అందుకోవడం.
- ●2022వ సంవత్సరంలో ప్రతిష్ఠాత్మక ముద్ర సభ చెన్నై వారి నుంచి 'సంగీత ముద్ర' అవార్డు స్వీకరించడం.
- ●గుంటూరు గాయత్రి మహిళా సంగీత సన్మండలి వారు 'సంగీత యువ రత్న' పురస్కారం ప్రదానం
- ●మురళి సంగీతోత్సవాలలో చెన్నైలోని సునాదల హరి సభ వారినుండి 'బెస్ట్ వయోలినిస్ట్' అవార్డు గ్రహించడం.
- ●విశాఖ మ్యూజిక్ అకాడమీ నుంచి 'ఆర్టిస్ట్ ఆఫ్ డిస్టింక్షన్' పురస్కారం అందుకోవడం.
- ●పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గాత్రం, వయోలిన్‌లలో 'డిస్టింక్షన్ స్టూడెంట్ అవార్డు'. ఇవి గాయత్రి సాధించిన పురస్కారాల్లో కొన్ని మాత్రమే. బాల్యం నుంచి ఇటు శాస్త్రీయ గాత్ర సంగీతం, అటు వయోలిన్ వాద్య సంగీతంలో పలు పురస్కారాలు గాయత్రిని వరించాయి.



ప్రముఖులచే అవార్డును అందుకుంటున్న దృశ్యం

సంగీత ప్రస్థానం గురించి చెబుతూ.. "నాకు సంగీతమంటే పంచ ప్రాణాలు. అమ్మ, నాన్న నాకు చిన్నప్పటి నుంచి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహంతోనే నేను గాత్ర, వయోలిన్ సంగీతాల్లో ఈ స్థాయికి చేరుకున్నా. వారి ప్రోత్సాహానికి అవధులు లేవు. నాకు సమయం ఇవ్వాలనే భావనతో అమ్మ నా కోసం స్కూటర్ నడపడం నేర్చుకొని దానిపై స్కూలుకి, సంగీత తరగతులకు తీసుకొని వెళ్లడం మరిచిపోలేని జ్ఞాపకం. అంతేకాదు మద్రాస్‌లో సంగీతానికి తగిన గుర్తింపు ఉంటుందని నాన్న నన్ను మూడు సంవత్సరాల క్రితం చెన్నైలో స్థిరపరిచారు. నా కోసం తను ఉద్యోగం నుంచి వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అతి త్వరలో అమ్మ, నాన్న కూడా చెన్నైలో స్థిరపడనున్నారు. నా సోదరులు వృత్తిపరంగా ఉద్యోగాల్లో స్థిరపడినా వారి సంగీతాభిరుచిని పండించుకుంటూ ఇద్దరూ వాయిద్య సంగీతంలో శిక్షణ తీసుకుంటున్నారు. ఒక అన్న నాన్నలాగ ఫ్లూట్ వాద్యంలో ప్రావీణ్యం సంపాదించారు. మరో అన్న మృదంగం వాద్యంలో శిక్షణ కొనసాగిస్తున్నాడు. సంగీత కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు నాకు అందించిన ప్రోత్సాహం, ప్రేరణ అనిర్వచనీయం" అని గాయత్రి తెలిపింది.

వాద్య సహకారం....

గాయత్రి ఎందరో విద్వాంసులకు వయోలిన్‌తో వాద్య సహకారం అందించారు. మందా సుధారాణి, శారదా సుబ్రహ్మణ్యం, సరస్వతీ విద్యార్థి నిశారాజగోపాల్, డాక్టర్ ఆర్.గణేష్ మొదలైన ప్రముఖ విద్వాంసుల గాత్ర కచేరీలలో గాయత్రి వయోలిన్‌తో వాద్య సహకారమందించింది. వారి ప్రశంసలకు పాత్రురాలైంది.

బహుముఖ ప్రజ్ఞ...

గాయత్రి ఒకవైపు గాత్ర సంగీత తరగతులకు, వయోలిన్ క్లాసులకు హాజరవుతూనే ప్రతినిత్యం 5 గంటలపైన సంగీత సాధన చేస్తోంది. ఇంట్లో సంగీత, వయోలిన్ తరగతులు నిర్వహిస్తూ గురువు పాత్ర పోషిస్తోంది. విదేశీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో గాత్ర, వాద్య సంగీతాల్లో శిక్షణ ఇస్తోంది. తన కాళ్లమీద తాను నిలబడే స్థాయికి ఎదిగిన గాయత్రి చదువులోనూ సరస్వతే. దూర విద్య ద్వారా ఎంబీఏ చదువుతున్న ఆమె అతి త్వరలో డిగ్రీ తీసుకోబోతున్నది.

తరుణితో తన మనోభావాలు పంచుకుంటూ గాయత్రి విభావరి ఇలా అన్నది. "నాకు సంగీతమే ప్రపంచం సంగీతానికి సంబంధించి ప్రతినిత్యం ఏదో ఒక నూతన విషయం గ్రహించడం నా అభిరుచి. ఏ కళ అయినా అభ్యసంతోనే సాధించగలుగుతాం. పాటైనా, వాయిద్యమైన తాదాత్మ్యం పొందితేనే రాణింపు వస్తుంది.



రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు వా.వు. చిదంబరనార్ 154వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



గాంధీ మండపం వద్ద ప్రభుత్వం తరపున స్వాతంత్ర్య సమరయోధుడు వా.వు. చిదంబరనార్ 154వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

ఓటీఏలో అబ్బురపరచిన విన్యాసాలు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ' (ఓటీఏ)లో శుక్రవారం నిర్వహించిన విన్యాసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. ప్రదర్శనలో శారీరక శిక్షణ నైపుణ్యాలు, ఆర్మీ మార్షల్ ఆర్ట్ రెజిమ్, మోటార్ సైకిల్ డిస్ప్లే బృందం చేసిన ఉత్కంఠభరిత విన్యాసాలు, కేరళలోని మలబార్ ప్రాంతానికి చెందిన యుద్ధ కళారూపం 'కలరిపయట్టు', గుర్రాలపై రైడర్లు చేసిన విన్యాసాలు ఆద్యంతం అలరించాయి. ఓటీఏ చెన్నై కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఏజే ఫెర్నాండెజ్ ప్రారంభించిన ఈ ప్రదర్శన ఆఫీసర్ క్యాడెట్లు ఉగ్ర స్ఫూర్తి, నైపుణ్యం ప్రదర్శించే బంకర్ బరస్టింగ్ డ్రిల్‌తో ముగిసింది. ప్రదర్శనలో పాల్గొన్న క్యాడెట్లకు లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఏజే ఫెర్నాండెజ్ అభినందించి, వారి అద్భుతమైన నైపుణ్యతను ప్రశంసించారు.









మార్షల్ ఆర్ట్స్



మండుతున్న రాళ్లను చేతితో పగులగొడుతున్న దృశ్యం - కత్తి విన్యాసం - మంటల్లో నుంచి దూకుతూ...



'బ్లాక్‌మెయిల్' ఆడియో రిలీజ్ కార్యక్రమంలో చిత్ర బృందం

చిత్రజ్యోతి

ప్రేక్షకులను కట్టిపడేసే 'బ్లాక్‌మెయిల్'

● జీవీ ప్రకాష్

తాను కథానాయకుడుగా నటించిన 'బ్లాక్‌మెయిల్' చిత్రం ప్రేక్షకులను కట్టిపడేసే, సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్ మూవీగా ఉంటుందని ప్రముఖ సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాష్ కుమార్ పేర్కొన్నారు. ము.మారన్ దర్శకత్వంలో జేడీఎస్ ఫిలిమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై జయకొడి అమల్‌రాజ్ నిర్మించగా, ఈనెల 12న విడుదలయ్యే ఈ చిత్రం ప్రి రిలీజ్ ఈవెంట్ గురువారం నగరంలో నిర్వహించారు. ఇందులో చిత్ర హీరో జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'యూనిట్ సభ్యులంతా ఎంతో సిన్సియర్‌గా పనిచేసి ఒక మంచి చిత్రాన్ని తీశారు. ఆడియన్స్‌ను ఉత్కంఠతకు లోనుచేసే మూవీ. మీడియా మిత్రులు సపోర్టు చేయాలి' అని కోరారు. చిత్ర దర్శకుడు ము.మారన్ మాట్లాడుతూ, 'చిత్ర నిర్మాణంలో నిర్మాత సహకారం మరిచిపోలేనిది. క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సమయంలో నిర్మాత, పంపిణీదారుడు ధనుంజయన్ అండగా నిలిచారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక నిపుణులతో పాటు ఇతర నటీనటులు, అమ్మా క్రియేషన్స్ టి.శివ, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధనుంజయన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ చిత్రంలో జీవీ ప్రకాష్, తేజు అశ్విని, బిందు మాధవితో పాటు పలువురు ప్రధాన నటీనటులు నటించారు.

'లోకా'కు ఈ స్థాయి స్పందన ఊహించలేదు : దుల్కర్ సల్మాన్



హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో తాను సొంతంగా నిర్మించిన 'లోకా : చాప్టర్ 1' చిత్రానికి ఈ స్థాయి స్పందన తాను ఊహించలేదని ఆ చిత్ర నిర్మాత దుల్కర్ సల్మాన్ అన్నారు. ఈ చిత్రం విడుదలైన ఏడు రోజుల్లోనే రూ.100 కోట్ల మేరకు వసూళ్లను రాబట్టింది. దీంతో చిత్ర విజయోత్సవ వేడుకలను గురువారం నగరంలో నిర్వహించారు. ఇందులో కళ్యాణి ప్రియదర్శన్, దుల్కర్ సల్మాన్, చిత్ర దర్శకుడు డొమినిక్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా కళ్యాణి మాట్లాడుతూ, 'లోకాకు ఈ స్థాయిలో అభినందనలు లభిస్తాయని ఊహించలేదు. మీడియా సపోర్టు కారణంగానే ఘన విజయం సాధించింది. యాక్షన్ సినిమాలో సూపర్ హీరోగా నటించనున్నట్టు నా తండ్రికి చెప్పగా కాళ్ళు చేతులు జాగ్రత్త అంటూ సలహా ఇచ్చారు. ఇపుడు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడానికి కారణం నేను కాదు.. సమష్టి కృషి' అన్నారు. నిర్మాత దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, 'కేరళలో ఒక చిన్న చిత్రంగా 'లోకా' ప్లాన్ చేశాం. కానీ, ఈ స్థాయిలో రీచ్ అవుతుందని ఊహించలేదు. కథ వినగానే ప్రధాన పాత్రకు కళ్యాణిని ఎంచుకున్నాం. ఆ మరుక్షణం నుంచే ఆమె ట్రైనింగ్‌లో నిమగ్నమయ్యారు. నేను ఎన్నో చిత్రాల్లో హీరోగా నటించాను. కానీ, ఇంత క్రేజ్ రాలేదు. మొత్తం 5 భాగాల ప్రాజెక్టు. ఈ విజయంతో మిగిలిన నాలుగు భాగాలను జాగ్రత్తగా తీస్తాం. మలయాళం, తెలుగు భాషల్లో నేను నటించే ప్రతి చిత్రాన్ని తమిళంలోకి అనువాదం చేసి రిలీజ్ చేసినా, కోలీవుడ్ ప్రేక్షకులు అమితంగా ఆదరిస్తున్నారు. వారితో పాటు మీడియాకు ధన్యవాదాలు' తెలిపారు.

ఇన్బన్.. కొత్త జర్నీ ప్రారంభం



తనయుడు ఇన్బన్‌తో ఉదయనిధి

డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తనయుడు ఇన్బన్ కొత్త జర్నీ ప్రారంభించారు. ఉదయనిధికి చెందిన సినీ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్ సమర్పకుడిగా ఇన్బన్ ఉదయనిధి కొత్త ప్రయాణం ప్రారంభించనున్నారు. ఆయన ఆధ్వర్యంలో తొలిసారి 'ఇడ్లీకడై'చిత్రాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విడుదలకానుంది. ధనుష్ హీరోగా నటించిన ఈ చిత్రానికి ఆయనే దర్శకత్వం వహించారు. నిత్యా మేనన్ హీరోయిన్. అరుణ్ విజయ్, సత్యరాజ్, రాజ్‌కిరణ్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. వచ్చే నెల ఒకటో తేదీన విడుదలకానుండగా చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలను మేకర్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం పంపిణీ హక్కులను రెడ్ జెయింట్ మూవీస్ సొంతం చేసుకుందని, ఇన్బన్ ఈ మూవీ రిలీజ్ బాధ్యతలను చేపట్టారని ధనుష్ వెల్లడించడం గమనార్హం. 'రెడ్ జెయింట్ మూవీస్' సమర్పకుడిగా ఆ చిత్రంలో ఇన్బన్ దయానిధి పేరు సినిమా టైటిల్ కార్డులో రానుంది.

ధనుష్ సరసన మీనాక్షి చౌదరి?



స్టార్ హీరో ధనుష్ సరసన హీరోయిన్ మీనాక్షి చౌదరి నటించనున్నారు. విజయ్ నటించిన 'ది గోట్', ఆర్జే బాలాజీ నటించిన 'సింగపూర్ సలూన్' సినిమాల తర్వాత ఆమెకు కోలీవుడ్‌లో మరో అవకాశం రాలేదు. తెలుగులో మాత్రం వరుస అవకాశాలను దక్కించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ధనుష్ నటించే 55వ చిత్రంలో నటించనున్నారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించే ఈ ప్రాజెక్టు ప్రీ-ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులోభాగంగా హీరోయిన్‌గా మీనాక్షి చౌదరిని ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

అజిత్ చిత్రానికి వ్యతిరేకంగా ఇళయరాజా పిటిషన్

పెరంబూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నటుడు అజిత్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంపై సంగీత దర్శకులు ఇళయారాజా మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. చిత్రంలో 'ఇలమై ఇదో ఇదో...', 'ఒత్త రూపాయిమ్ తరేన్...', 'ఎన్ జోడి మంజ కురివి...' అనే పాటలు వినియోగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ ఈ నెల 8వ తేది విచారణకు రానుంది.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

శ్రీవారి సేవలో మరింత నాణ్యత: టీటీడీ ఈవో




తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల శ్రీవారిసేవలో నాణ్యత పెరుగుతుందని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. శ్రీవారిసేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్లకు శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. శిక్షణ మొదటి విడత కార్యక్రమం ఈనెల 24 నుంచి ప్రారంభమై మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఏపీ ప్లానింగ్ విభాగం ఈడీ వెంకటేశ్వరావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామమోహన్, అదనపుఈవో వెంకయ్య చౌదరి ఈసమీక్షలో పాల్గొన్నారు.

తిరుమలలో నేడు అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి రోజుల్లో కూడా చక్రస్నానం నిర్వహిస్తారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,834

తలనీలాలు సమర్పించినవారు: 24,628

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ



అమ్మవారికి హారతులు ఇస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీపద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు ఉదయం ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆవాహనం, చక్రాది మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాలను పురస్కరించకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠ స్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో రెండో రోజైన శనివారం శనివారం పవిత్ర సమర్పణ ఉంటుంది.



యాగశాలలో ప్రత్యేక పూజలు



బన్వారిలాల్ వర్మ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి బన్వరిలాల్ వర్మ, తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో తెలంగాణ హైకోర్టు సీజే



ఆలయం వద్ద తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

తిరుచానూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, శాంతారాం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులలో ఆనందం వెల్లువ

- ఎద క్రమబద్ధీకరణ పథకంతో సత్ఫలితాలు
- స్వర్ణ నారావారిపల్లెలో తొలిదశలోనే 61 శాతం విజయవంతం



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించేందుకు రైతులు తీసుకువచ్చిన పశువులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత గ్రామం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలో పాడిరైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ క్లస్టర్ పరిధిలో ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలున్నాయి. సీఎం సంకల్పం మేరకు స్వర్ణ నారావారిపల్లె పైలెట్ ప్రాజెక్టులో క్లస్టర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదాయాభివృద్ధితో స్వావలంబన సాధించేలా పథకాలు రూపొందించారు. ఇప్పటికే నారావారిపల్లెలో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఇటీవల జిల్లా కలెక్టర్ స్కోచ్ అవార్డు కు ఎంపికయ్యారు. అదేవిధంగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలోని ఎద క్రమబద్ధీకరణ పథకం క్లస్టర్ పరిధిలో పాడిరైతులకు వరంగా మారింది. గతంలో చూలు కట్టని పశువుల పోషణ రైతులకు ఆర్థిక భారమయ్యేది. పశువులను మేపడం కష్టమై ఒక్కోసారి కోతకు కూడా విక్రయించేవారు. పశువు ఏటా ఈనితేనే లాభమొస్తుంది. ఈనేపథ్యంలో ఈ ఏడాది మార్చి చివర్లో ఎద క్రమబద్ధీకరణ పథకం కింద 171 మంది రైతులకు చెందిన 218 పశువులను ఎదకు రానివిగా గుర్తించారు. 50 శాతం రాయితీతో రూ.400 కట్టించుకుని రూ.1100 విలువ గలదాణా, ఖనిజలవణ మిశ్రమం, లవణ మాత్రలు, హార్మోను ఇంజక్షన్లు తదితర మందులను రైతులకు అందించారు. ఇవి చూలు కట్టడానికి దోహదపడుతున్నాయి. నిత్యం సుమారు 25 మంది సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల మొదటి వారం పరీక్షించగా 134 పశువులు ఎదకు వచ్చినట్లు గుర్తించామని పశువైద్యాధికారి తెలిపారు. మొదటి విడతలోనే 61 శాతం మేర సానుకూల ఫలితాలను రావడంతో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాల ఉత్పత్తి పెంపు లక్ష్యం



క్లస్టర్ పరిధిలోని పశువులలో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మొదటి విడతలోనే 61 శాతం ఫలితాలను రాబట్టాం. నాలుగు విడతల్లో వెయ్యి పశువులకు చూలు కట్టించాలనేది ఉద్దేశం. కొత్త పథకం కింద అదనంగా 4200 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. సంవత్సరానికి రూ.73 లక్షల మేర అదనపు ఆదాయం చేకూరుతుంది.

-డాక్టర్ వంశీ, పశు వైద్యాధికారి, నారావారిపల్లె

గతంలో ఎన్నో ఇబ్బందులు



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించడం పాడి రైతులకు వరం. గతంలో కృత్రిమ గర్భధారణకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఎదకు రాని పశువులను మేపడం కష్టంగా ఉండేది. ఆర్థికంగా దెబ్బతిని పశువులను కోతకు ఇచ్చేవాళం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల కొత్త పథకంతో ఆర్థికంగా నిలబడతామని నమ్మకం కలిగింది

- చంద్రబాబునాయుడు, భీమవరం

రెండు విధాలా ఆదాయం



ఎదక్రమబద్ధీకరణ పథకం ద్వారా చూలు కట్టిన పశువును అమ్ముకోవాలన్నా రెండింతలు హెచ్చు ధర పలుకుతుంది. చూలు కట్టిన పశువు రైతు దగ్గరే ఉంటే పాల ఉత్పత్తి రెండింతలు పెరుగుతుంది. ఇలా రెండు రకాలూ ఆర్థికంగా ఆదాయం ఉంటుంది. ఈ పథకంతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- సుబ్రమణ్యంయాదవ్, ఎ.రంగంపేట

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒక కారు సీజ్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీశాఖ అధికారులు

మంగళం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): రేణిగుంట-మామండూరు మార్గంలో శుక్రవారం తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. తిరుపతి రేంజర్ సుదర్శన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి నుంచి ఆ మార్గంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. పులిచెర్ల వద్ద వేగంగా వస్తున్న ఏపీ 39 సి7116 నెంబరు కారును ఆపే ప్రయత్నం చేయగా వారు ఆపలేదు. దీంతో వాహనాన్ని వెంబడించారు. చైతన్యపురం చెక్‌పోస్టు సమీపంలో కారును ఆపి డ్రైవర్ పారిపోయాడు. అధికారులు కారులో పరిశీలించగా 8ఎర్రచందనం దుంగలు ఉన్నాయి.కారు సహా దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ దుంగలు, కారు విలువ రూ.5లక్షలుంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఆర్‌వోస్ చైతన్య, ఎఫ్‌బీవో చెంగల్రాయ నాయుడు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రి, వెంకట్, రవి, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డివారిపల్లెలో చోరీ

రూ.40వేలు నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి అపహరణ





ఈశ్వర్ ఇంట్లో పగలగొట్టిన బీరువా - గీత ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ రెడ్డివారిపల్లెలో చోరీ జరిగింది. నగలు, నగదు అపహరణకు గురైంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వర్ తన తండ్రికి అనారోగ్యం కారణంగా ఇంటికి తాళాలు వేసుకొని గురువారం తిరుపతికి వెళ్లారు. గ్రామానికి చెందిన గీతా కుటుంబ సభ్యులు వేరే ఊరికి వెళ్లడంతో ఆమె అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండిళ్లలో తాళాలు పగలగొట్టి ఈశ్వర్ ఇంట్లో 40 వేలు నగదు, గీతా ఇంట్లో 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి చోరీ చేశారు, శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకున్న ఇరు కుటుంబాల వారు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో వచ్చి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

- రూ.70వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కార్తీక్

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాళెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలుపెట్టాడని పోలీసులు తెలిపారు.

నాదస్వర డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కుల పంపిణీ



అందుకున్న డిపాజిట్ చెక్కుతో నాదస్వర డోలు విద్యార్థులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో నాదస్వర డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. 2017-2023, 2018-2024 విద్యాసంవత్సరంలో ఆరేళ్లపాటు సర్టిఫికెట్ డిప్లొమా కోర్సులో ఉత్తీర్ణులైన డోలు విద్యార్థులకు రూ.46.20లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా డోలు విద్యార్థులు వెంకటేశ్వరస్వామికి తమ డోలు విద్య ద్వారా నాదాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమాముద్దబాల, నాదస్వర పాఠశాల హెచ్ఐ బి.లక్ష్మి సువర్ణ, విద్యాశాఖ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శివకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై నెలంతా రేషన్

- త్వరలో రానున్న ఉత్తర్వులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకధర దుకాణాలను నెలంతా తెరచి ఉంచనున్నారు. ఈ నెల వ్యవధిలో ఎప్పుడైనా కార్డుదారులు సరుకులు కొనుగోలు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతుండగా, త్వరలో ఉత్తర్వులు రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1457 రేషన్ షాపులు.. దాదాపు 5,81,145 స్మార్ట్ కార్డులు వున్నాయి. ప్రస్తుతం ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర వస్తువులు తీసుకోవచ్చు. వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు కూలీలకు వెళ్ళిన వారు ఈ సమయంలో రేషన్ తీసుకోలేక పోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వదులుకోవాల్సి వస్తోంది. ఇక, నగరాలు, పట్టణాల్లో పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెలా పదో తేది వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం అయిపోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికులు కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంది. తిరుపతిలోని 67 శాతం దుకాణాల్లో ఐదో తేదీకే బియ్యం అయిపోయి రేషన్ దుకాణాలకు తాళాలు పడుతున్నాయి. ఆ షాపుల పరిధిలోని కార్డుదారులకు బియ్యం అందని పరిస్థితి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నెలంతా రేషన్ సరుకులు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. త్వరలో నెలంతా రేషన్ సరకులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు చెప్పారు. త్వరలో ఉత్తర్వులు వస్తాయని దీని తర్వాత అందులో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలన్నీ తెరచి ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, వచ్చే నెల నుంచి ఉచిత బియ్యంతో పాటు నగదుకు చక్కెర, కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి, ఇవ్వడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

జిల్లాలో విభాగాల వారీగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను 68 అందుకున్నారు. వీరిలో ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఉన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

హెచ్ఎం కేటగిరీ : జి.రామచంద్రయ్య, జడ్పీహెచ్ఎస్, పంగూరు, ఏర్పేడు మండలం.. పి.చిన్నబాబు, జడ్పీహెచ్ఎస్, ఇరుగులం, సత్యవేడు మండలం.. ఎం.కృష్ణవేణి, పీఎస్‌హెచ్ఎం, ఎంసీపీఎస్, టీపీ ఏరియా, తిరుపతి.. వి.హరినాథ్, పీఎస్‌హెచ్ఎం, ఎంపీఎల్ ఎంపీఎస్, కైలాసగిరి కాలనీ, శ్రీకాళహస్తి.

స్కూల్ అసిస్టెంట్: జి.తేజోవతి, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. డి.రఘునాథ్, తెలుగు, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వి.వెంకటరమణ, ఇంగ్లిష్, ఎంపీపీఎస్, టీపీ కోట, నాగలాపురం. ఎ.సుజాత, సోషల్, జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. డి.శ్రీనివాసులు, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, కరకంబాడి, రేణిగుంట. ఎం.జయంతి, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టేడు, కోట. ఎం.సుబ్బరామయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, వరదాయపాళెం. కె.సువర్ధన, ఫిజికల్ సైన్స్ జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. పి.కిషోర్‌కుమార్, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, ముచివోలు, శ్రీకాళహస్తి. సి.వాసు, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. కె.గోపి, సోషల్, ఎంపీఎస్, వడిమిట్ట, ఏర్పేడు. జె.చంద్రశేఖర్, బయాలజీ, జడ్పీహెచ్ఎస్, రంగన్నగిరిగడ్డ, చిన్నగొట్టిగల్లు. యు. పురుషోత్తం, ఫికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వీవీఎస్ఎస్ రాధామదనం, తెలుగు, పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్, మంగళం ట్రెండ్, తిరుపతి. ఎ.గోపి, సోషల్, జడ్పీహెచ్ఎస్, పాలమంగళం, నారాయణవనం. పి.రుద్రయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టత్తూరు, తొట్టంబేడు. ఎన్‌వీ లత, తెలుగు, జడ్పీహెచ్ఎస్, సంతవేలూరు, వరదాయపాళెం. సి.దామోదరం, హిందీ, జడ్పీహెచ్ఎస్, రాజానగరం, పిచ్చాటూరు. జి.జగదీష్, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, పుడుకుప్పం, సత్యవేడు. కె.మునస్వామి, తెలుగు, జడ్పీహెచ్ఎస్, పల్లమాల, బీఎన్ కండ్రిగ. కె.శంకరయ్య, హిందీ, జడ్పీహెచ్ఎస్, కొక్కుపాడు, కోట. కె.రఘునాథ, సోషల్, ఎంసీహెచ్ఎస్, టీవీ గుంట, తిరుపతి. జి.రాజేశ్వరి, సోషల్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, పుత్తూరు.

ఎస్జీటీ కేటగిరీ: ఎస్ఎస్ కృష్ణప్రియ, ఎంపీపీఎస్, సి గొల్లపల్లి, తిరుపతి రూరల్. వి.వెంకట నాగులు, ఎంపీఎస్ కోటాల, చంద్రగిరి. కె.రామిరెడ్డి, ఎంపీపీఎస్, పాతపేట, చంద్రగిరి. కె.మమత, ఎపీపీఎస్, పద్మావతిపురం, తిరుపతి రూరల్. కె.సురేష్, ఎపీపీఎస్, వాకాడు. టి.మురుగయ్య, ఎంపీపీఎస్, నాగులచెరువు, చంద్రగిరి. కె.బాలాజీ, ఎంపీపీఎస్, పిచ్చాటూరు. ఎం.శైలజ, ఎంపీపీఎస్, మల్లయ్యపల్లి, చంద్రగిరి. పి.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్, ముట్టెంబాక, వాకాడు. పి.పుష్ప, ఎంపీపీఎస్, వడమాలపేట. బి.నాగరాజు, ఎంపీపీఎస్, నెరబైలు, ఎర్రావారిపాళెం. ఎల్. వెంకటశారద, ఎంపీఎస్, పల్లెపాళెం, తడ. డి.పుష్పకిరణ్, ఎంపీపీఎస్, సీహెచ్ నిడిగల్లు ఎస్టీ. శ్రీకాళహస్తి. జి.మురళి, ఎంపీపీఎస్, పావన్నపల్లె, శ్రీకాళహస్తి. ఎస్.రత్నప్రభ, ఎంపీపీఎస్, కండలవారిపల్లి, డక్కిలి. సి.మానస, ఎంపీపీఎస్, భాగ్యనగరం, తిరుపతి రూరల్. పి.లక్ష్మీదేవి, ఎంపీపీఎస్, పోలిచెట్టిగారిపల్లె, పాకాల. ఎం.వెంకటస్వామి, ఎంపీఎస్ సి. మల్లవరం, తిరుపతి రూరల్. జి.పరంధామయ్య, ఎంపీఎస్ హెచ్‌డబ్ల్యు, కొట్టంబేడు, బాలాయపల్లి. ఆర్.మరియమ్మ, ఎంపీఎస్, ఉత్తమ నెల్లూరు, కోట. ఎం.సుబ్రహ్మణ్యం, ఎంపీపీఎస్, నెల్లటూరు మెయిన్, గూడూరు. బి.వెంకటాద్రి, ఎంపీపీఎస్, రెడ్డివారిపల్లె, ఎర్రావారిపాళెం. కె.ఆదినారాయణ, ఎంపీపీఎస్, ఏర్పేడు. డి.జగదీశ్వరి, ఎంపీఎస్, మనులాలుపేట, వెంకటగిరి. ఎం.తిరుమల కొండయ్య, ఎంపీపీఎస్, కాపులూరు మెయిన్. నాయుడుపేట. ఎస్‌కే బాబూలాల్, ఎంపీపీఎస్, కొత్త కండ్రిగ, తొట్టంబేడు. ఆర్. మంజులా దేవి, ఎంపీపీఎస్, తోలుమిట్ట, వెంకటగిరి. ఎం.ప్రభు, ఎంపీపీఎస్, చిన్నగోర్పాడు. పాకాల. వై.మునికుమార్, ఎంపీపీఎస్, తిరువత్యమ్, నారాయణవనం. కె.వినయ్‌కుమార్, ఎంపీపీఎస్, కొత్తపల్లె, దొరవారిసత్రం. వి.సుధాకర్, ఎంపీపీఎస్, తంగేళ్లపాళెం, తొట్టంబేడు. సి.గురవారెడ్డి, ఎంపీపీఎస్, చిందేపల్లి, ఏర్పేడు.

మండల విద్యాశాఖాధికారులు

జి.ఇందిరాదేవి, రేణిగుంట. కె.భాస్కర్‌బాబు, చంద్రగిరి. బి.తిరుమల రాజు, పుత్తూరు. కె.రవీంద్రనాద్, బీఎన్ కండ్రిగ. బి.మునిరత్నం, నాయుడుపేట. కె. మల్లిఖార్జునరావు, తడ.

కేజీబీవీ కేటగిరీలో: పి. సతీ సావిత్రి, సీఆర్టీ పీఈటీ.

అక్టోబరు 7న భవ్య గుజరాత్ యాత్ర

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి అక్టోబరు 7వ తేదీన భవ్య గుజరాత్ యాత్రకు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ యాత్రలో ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, మోఢేరా, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నదీ తీరం, యునెస్కో వారసత్వ స్థలం రాణికి వావ్, ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ యాత్రా రైలు రేణిగుంట నుండి ప్రారంభమై గూడూరు, నెల్లూరు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్, నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంటకు చేరుతుందన్నారు. ప్రయాణికులకు వసతితో పాటు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, శాకాహార భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రయాణ బీమా కూడా కల్పించినట్లు వివరించారు. టిక్కెట్టు ధరలు స్లీపర్ క్లాస్ రూ.18,400లు, త్రీటైర్ ఏసీ రూ.30,200లు, టూటైర్ ఏసీ రూ.39,900లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పది రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. టిక్కెట్టు బుకింగ్ కోసం కె.పవన్‌కుమార్‌ను 9281495853, యేసయ్యను 8287932313 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌బాబు, వీరన్న, కోదండం, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న రైల్వే అధికారులు